క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



తాడేపల్లిరూరల్ : స్థానికంగా ఉన్న అధికారులకు ఉచిత ఇసుకపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. ఆదివారం తెల్లవారుజామున చిర్రావూరు నుంచి నిషేధిత ఇసుక రిచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో తాడేపల్లి పోలీసులు మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఒక పక్క ఉచిత ఇసుక అంటూ మరో పక్క ట్రాక్టర్లను సీజ్ చేయడం పట్ల ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు వాహనాలు చిర్రావూరుకు చెందిన బాజి, ప్రసాద్, హరీష్ అనే వ్యక్తులువిగా తెలియవచ్చింది.

దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రామచంద్రాపురంలో ఇసుక అక్రమ రవాణాలో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తిపై బాబాయి, అబ్బాయిలు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ వివరాల మేరకు.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వల్లెపు హరికృష్ణ, రామకృష్ణ గురించి పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మరో వ్యక్తి సురేష్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లెపు హరికృష్ణ, రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

కుంచనపల్లిలో ఉచిత వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ కుంచన పల్లిలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ మాట్లాడుతూ కుంచనపల్లిలోని రామ్ స్నేహ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ నందు వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, వైద్యులు సుమారు 160 మందికి వివిధ రకాల ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో వెంకటరెడ్డి, పరమేశ్వరి సుబ్బారెడ్డి, హనుమాన్, రాజారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, బాబు, విజయ్, నందు పాల్గొన్నారు.


బద్వేల్ దోషులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్ : కడప జిల్లా బద్వేలులో ఇంటర్‌చదువుతున్న విద్యార్థినిని ప్రేమపేరుతో పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మన రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం భద్రత లేని స్థితిలో ఉందని, ముఖ్యమంత్రి ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో, వాటిని అరికట్టడానికి ఏ చర్యలు చేపడతారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటర్ చదువుతున్న దస్తగిరమ్మను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడు గణేష్‌ను, అతనికి సహకరించిన స్నేహితులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

దస్తగిరి కుటుంబానికి న్యాయం చేయాలి



షేక్ అబ్బాస్

మేడికొండూరు : ఒక ఉన్మాది చేతిలో అతికిరాతంగా హత్యకు గురైన దస్తగిరి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు షేక్ నాజర్ వలి అబ్బాస్ ఆదివారం అన్నారు. కడప జిల్లా బద్వేలులో మైనార్టీ వర్గానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి షేక్ దస్తగిరిను కిరాతకంగా హతమార్చిన విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా అతి త్వరగా కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అబ్బాస్ డిమాండ్ చేశారు.

పడకేసిన ప్రజా వైద్యం

- అలంకార ప్రాయాలుగా అర్బన్ పీహెచ్‌సీలు
- అందుబాటులో ఉండని వైద్యులు
- రోగుల పరిస్థితి అగమ్యగోచరం
- ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు



మార్కేండేయ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మంగళగిరి: పేదవాడికి నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందినప్పుడే వారి జీవితాలు మారతాయని భావించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో 30 వేల మందికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్ అందుబాటులో ఉండాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భావించింది. ఎంటీఎంసీ పరిధిలో తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్)లు నిర్మించి, ప్రారంభించారు. ఒక్కో సెంటర్‌కు ప్రభుత్వం రూ.82 లక్షలు కేటాయించగా.. హెల్త్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు వుండాలనే లక్ష్యంతో ఎంటీఎంసీ నుంచి మరో రూ.70లక్షలు వెచ్చించి, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. ప్రాథమిక వైద్యంతో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. పది పడకలు ఉండేలా హెల్త్ సెంటర్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించారు. మూడు నెలల క్రితం వరకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో నేడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. సేవలు పూర్తిగా పడకేశాయి. ప్రతి రోజు పది గంటలకు రావాల్సిన వైద్యులు సిబ్బంది పద కొండు గంటలు దాటినా హాజరుకావడం లేదని రోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులతో సమావేశాల పేరుతో ఒక్కో రోజు వైద్యులు విధుల్లో ఉండటం లేదు. దీంతో నర్సులు, సిబ్బందితోనే వైద్య సేవలు అందిస్తున్నారు. మందుల కొరత వెంటాడుతోంది. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు ఆశ్రయించక తప్పడం లేదు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే ప్రైవేటు వైద్యులు లేని పోని పరీక్షలు, వైద్య సేవల పేరుతో వారి రక్తాని పీల్చి పిప్పి చేస్తుండడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు. మూడు నెలల క్రితం వరకు 250 మందికి పైగా రోగులకు వైద్య సేవలందించిన వైద్యశాలలకు నేడు 50 మందికి లోపు కూడా రావడం లేదని వైద్యులు చెప్పడం విశేషం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నిర్మించారనే భేషజాలకు పోకుండా నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది సమయానికి హాజరై రోగులకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా మందులు ఇచ్చే గది



గదిలో ఖాళీగా ఉన్న కుర్చీ

గుంటూరు సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు, ఆర్థిక మాద్యం, మతోన్మాదం తదితర అంశాలపై గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంటీ పరిధిలోని చిర్రావూరులో కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, మతోన్మాద పాలన సాగిస్తోందన్నారు. అదేవిధంగా జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. క్రిమినల్ చట్టాలలో మార్పులు తీసుకువచ్చి, ప్రతిపక్షాలపైన, ఉద్యమ కారులపైన, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని, వామపక్ష అభిమానులను నిర్బంధించే ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టారన్నారు. గుంటూరులో సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పాల్గొని, ప్రసంగిస్తారని చెప్పారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, చిర్రావూరు కార్యదర్శి బొప్పన గోపాలరావు, నాయకులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

విజయవాడ సదస్సును..

తాడేపల్లిరూరల్ : వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తూ, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈ నెల 22న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శివ, బాబు, భూపతి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



ప్రచారం నిర్వహిస్తున్న జొన్నా శివశంకరరావు

పేదలకు పెన్షన్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసిసోయేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు రూ.500 చొప్పున నెలవారీ పెన్షన్, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు చింతా రామకృష్ణ, ప్రతి నెలా నిర్వహిస్తున్న పెన్షన్ పథకానికి రూ.54వేలు విరాళంగా అందజేశారు. చీరాల అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల రూ.500 చొప్పున 108 మందికి పెన్షన్‌తో పాటు రూ.వెయ్యి విలువగల నిత్యావసరాలు పంపిణీ చేసి, వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణానికి మారుపేరు అని, అవోపా ద్వారా విద్య, వైద్య సేవలతో పాటు ప్రతివారం గో సేవ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, అవోపా గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ బ్రహ్మం, రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, వెంకట్రావు, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెన్షన్ అందజేస్తున్న అతిథులు, అవోపా ప్రతినిధులు

కమ్యూనిస్టు ఉద్యమ త్యాగాల పురిటిగడ్డ తాడేపల్లి

తాడేపల్లిరూరల్ : కమ్యూనిస్టు ఉద్యమ పురిటిగడ్డ తాడేపల్లి అని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మేకా అమరారెడ్డి 43వ వర్ధంతి సభను పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామారావు అమరారెడ్డి, బండారు ముత్యాలు, మాలకొండారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం త్యాగాలు చేసిన వారిలో మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండారెడ్డి ఉన్నారని చెప్పారు. తాడేపల్లి ప్రాంతంలో వేలాది మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు వేయించిన చరిత్ర సీపీఎం పార్టీదేనన్నారు. ఇందులో అమరారెడ్డి లాంటి త్యాగధనుల ప్రాత ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు ప్రపంచ బ్యాంక్ నుంచి రాష్ట్రానికి అప్పు ఇప్పిస్తే, అదేదో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సరైంది కాదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలు, స్థలాల రిజిస్ట్రేషన్ చేయిస్తానని మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ శిలాఫకం వేసి, హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, వేముల దుర్గారావు, పాశం రామారావు, గాదే సుబ్బారెడ్డి, ఎ.జగన్, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, డి.శ్రీనివాసకుమారి, గాది సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్, కోట బాబూరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌ను తీయవద్దని చెప్పారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అనవసరంగా వివాదాలు, గొడవలకు దిగితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఢిల్లీకి వెళ్లనున్న కమిషనర్

నెహ్రూనగర్: అంతర్జాతీయ వర్క్ షాపునకు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం వెళ్లనున్నారు. అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే, రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈ నెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వర్క్ షాపులో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్, పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కుప్పం, మంగళగిరి- తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతపురం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొననున్నారు.

కుల వ్యవస్థను నిలబెట్టడమే సనాతన వాదం

నగరంపాలెం: సనాతన వాదమంటే కూలిపోతున్న కుల వ్యవస్థను తిరిగి నిలబెట్టడమేనని విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బ్రాడీపేట యూటీఎఫ్ హాలులో సనాతన ధర్మం- రాజ్యాంగం అనే అంశంపై సభ నిర్వహించారు. సభకు కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రకారం స్త్రీని అత్యంత తక్కువ స్థాయిలో ఉంచడమేనని అన్నారు. సనాతన ధర్మాన్ని ప్రస్తుతం రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడారు. నాయకులు సాధు మాల్యాద్రి, సీనియర్ న్యాయవాది వైకే, వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, సామాజిక కార్యకర్త కనకపల్లి వినయ్, కవి, నాటక ప్రయోక్త దేవరపల్లి ప్రభుదాస్, మాల మహానాడు నాయకులు బత్తుల అనిల్ బాబు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు ఈరి రాజశేఖర్, మేడద బాబూరావు, బి.కె.రావు, బండారు దేవరాజు పాల్గొన్నారు.

మువ్వల సవ్వడి అలరించగా..



తెనాలి: ద్వారక తిరుమలలో దేవస్థానం నిర్వహణలో జరుగుతున్న అశ్వయుజ మాస తిరు కళ్యాణ మహోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ యువనర్తకి, నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందం కూచిపూడి నృత్యం అభినందనలు అందుకొంది. ఈనెల 13వ తేదీ నుంచి 20 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించారు. చివరిరోజైన ఆదివారం సాయంత్రం తేజస్వి ప్రఖ్య బృందానికి అవకాశం కల్పించారు. ద్వారక తిరుమలలోని కళావేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రఖ్య శిష్యబృందంలోని యనమదల రీతిక, ఆరిశెట్టి ఐశ్వర్య, మునిపల్లి పావని, మునిపల్లి భవానిలు అన్నమాచార్య కీర్తనలకు నృత్యం చేశారు. దేవస్థానం అధికారులు సిబ్బంది నృత్యగురువు తేజస్వి ప్రఖ్య శిష్యబృందానికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. గత నెలరోజుల్లో ప్రతిష్టాత్మక కాణిపాకం బ్రహ్మోత్సవాలు, తిరుమల బ్రహ్మోత్సవాలు, పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం, ద్వారకాతిరుమల బ్రహ్మోత్సవాల్లో నృత్యాంశాలను ప్రదర్శించిన ప్రఖ్య, ఆమె శిష్యబృందానికి స్థానికులు అభినందనలు తెలియజేశారు.

జీజీహెచ్‌కు కేటాయించిన స్థలం పరిశీలన



జీజీహెచ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధి కాకుమానువారితోటలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు కేటాయించిన స్థలాన్ని మూడు రోజుల్లో సమగ్ర సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ కాకుమానువారితోటలోని స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు డాక్టర్ రమేష్, జీఎంసీ, సీపీడీసీఎల్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. తొలుత మ్యాప్ ద్వారా మొత్తం ఎంత స్థలం, అందులో ఎంత స్థలం జీజీహెచ్‌కి కేటాయింపు జరిగింది, ప్రస్తుతం స్థలం ఎలా ఉంది పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకుమానువారితోటలో ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో ప్రస్తుతం కొంత ఆక్రమణలు జరగడం, పిచ్చి మొక్కలు పెరిగి ఉందన్నారు. రాబోయే మూడు రోజుల్లో జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారుల నేతృత్వంలో సర్వేయర్లు సదరు స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి, బౌండరీలు ఫిక్స్ చేయాలని ఆదేశించారు. బౌండరీలు ఫిక్స్ చేసిన అనంతరం ఆక్రమణలను, పిచ్చి మొక్కలను తొలగించేందుకు జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు సూచించారు. సదరు స్థలంలో భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా జీజీహెచ్ సుమారు రూ.90 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన స్థలంలో ప్రజారోగ్య కార్మికులు, చుట్టుపక్కల నివాసితులు వ్యర్థాలు, చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఓసీ(ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తుల భవనాలను పరిశీలించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరగాలని, ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకూడదని, సెట్ బ్యాక్‌లో జనరేటర్లు, ఇతర అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, బయాలజిస్ట్ మధుసూదన్, ఎంహెచ్‌ఓ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఏసీపీ ఫజులూర్ రెహ్మాన్ పాల్గొన్నారు.

నేడు నగరంలోని ట్రాఫిక్ మళ్లింపు



ఎస్పీ సతీష్ కుమార్

నగరంపాలెం: నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ ఎదురున్న అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి కార్యక్రమం పూర్తి వరకు కొనసాగుతుందని అన్నారు.

- పట్టాభిపురం నుంచి కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదగా నగరంపాలెం మూడుబొమ్మల కూడలి(రమేష్ ఆస్పత్రి) వైపుగా వెళ్లే వాహనాలన్నీ కలెక్టరేట్ జంక్షన్ వద్ద కుడివైపుగా తిరిగి కలెక్టర్ బంగ్లా రోడ్డు మీదగా వెళ్లాలి.
- వయా గుంటూరు మెడికల్ కళాశాల వైపుగా వచ్చే వాహనదారులు అంకమ్మతల్లి గుడి వద్ద ఎడమ వైపు వెళ్లాలి. అక్కడ్నుంచి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంటి వైపుగా కన్నవారితోట రోడ్డులోని వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు చేరుకోవాలి. ఇక నగరంపాలెం మూడు బొమ్మల కూడలి వైపు లేదా కలెక్టరేట్ రోడ్డు వైపు వెళ్లాలి.
- ఎంటీబీ కూడలి(రమేష్ ఆస్పత్రి) నుంచి వచ్చే వాహనదారులు కలెక్టరేట్, కంకరగుంట రైల్వే గేటు ఓవర్‌బ్రిడ్జి వైపు యథావిధిగా వెళ్లాలి.
- జిల్లా కోర్టు, సిబ్బంది, న్యాయవాదులు కోర్టు గేటు నంబర్- 2 ద్వారా లోపలికి వెళ్లాలి. ఐటీసీ కార్నర్ వైపు నుంచి నగరంపాలెం పోలీస్‌స్టేషన్ మీదగా వచ్చే వాహనదారులు కలెక్టరేట్ కార్యాలయం రోడ్డు, కంకరగుంట రైల్వేఓవర్‌బ్రిడ్జి మీదగా వెళ్లి సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. భారీ వాహనాలకు అనుమతి లేదని అన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ డాక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైందని అమ్మవంటిదని తెలిపారు. దీని వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణంగా మూలాలతో సహా వ్యాధులు నయం చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన 120 పడకలతో ఆయుర్వేద వైద్యశాలను గుంటూరు నగరంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి, డాక్టర్ కశ్యప్, డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య, మల్లేశ్వరి, కేరళ పంచకర్మిష్టులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారికి జాషువా సాహితీ పురస్కారం

తెనాలి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభలో మహాకవి జాషువా జాతీయ పురస్కారాన్ని తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి ప్రదానం చేశారు. సత్తెనపల్లి ఐఎంఏ హాలులో ఏర్పాటైన సభకు ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహిస్తారు. కార్యదర్శి స్వామి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అంజనీదేవి, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు, కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, రమ్య తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడుతూ నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువ పేరిట పురస్కారం అందుకోవటంపై సంతోషం వ్యక్తంచేశారు. తనకు లభించిన ఏడో జాతీయ అవార్డుగా తెలిపారు. జాషువా జాతీయ సాహితీ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞచారికి గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.



పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హిందూ ధర్మం విశ్వజనీయం

సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకరరావు

తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి రూ రల్, కొల్లిపర మండలాలకు చెందిన గ్రామ కన్వీనర్ల ఒక రోజు శిక్షణా తరగతులు ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో నిర్వహించారు. తెనాలి ఖండ ప్రముఖ్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం విశ్వజనీయం అన్నారు. ప్రపంచశాంతిని కోరుకుంటున్న హిందూ ధర్మం సనాతనమైనదని చెప్పారు. భగవద్గీత ప్రపంచంలో అత్యుమైన వ్యక్తిత్వ వికాస గ్రంథమని చెబుతూ రామాయణం మానవాళికి మార్గదర్శిగా మానవ నడవడికను తెలియజేసి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంతటి విశిష్టమైన హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన భాధ్యత గ్రామ కన్వీనర్లదేనని స్పష్టంచేశారు. హనుమత్ ప్రసాద్, అప్పికట్ల వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ విజ్జల సునీత, నందికంటి రామాంజనేయులు, మోదడుగు పవన్ రెడ్డి, క్రాప రవికుమార్, సమరసత సేవ ఫౌండేషన్ గ్రామ ధార్మిక సభ్యులు పాల్గొన్నారు.